
ప్రజాశక్తి

శుక్రవారం 13 డిసెంబర్ 2024

5

పార్వతీపురం మన్యం



భామినిలో త్వరలో పత్తి కొనుగోలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -భామిని

మండలంలోని పత్తి రైతుల చిరకాలవాంఛ అయిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని భామినిలో త్వరలో ఏర్పాటు చేస్తున్నామని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. గురువారం భామినిలో పత్తి రైతుల వద్ద వున్న పత్తిని ఎమ్మెల్యే పరిశీలించారు. పత్తి రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, భామినిలో కచ్చితంగా పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి, కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండలం టిడిపి అధ్యక్షులు బి. రవినాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం.జగదీశ్వరరావు, టిడిపి నాయకులు బిడ్డిక ప్రసాద్, గురుబిల్లి లక్ష్మీపతి, ఎస్.రాజు, జిల్లెడి రవి ఉన్నారు.

చలో ఐటిడిఎ ఉద్రిక్తత

ముట్టడికి యత్నించిన గురుకుల అవుట్ సోర్సింగ్ టీచర్లు ● అక్కడే రాత్రి బస

ప్రజాశక్తి - పార్వతీపురం

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు చేపట్టిన చలో ఐటిడిఎ కార్యక్రమం ఉద్రిక్తతలకు దారితీసింది. గత 23రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోపోవడంతో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు గురువారం చలో ఐటిడిఎ కార్యక్రమం నిర్వహించారు. ఐటిడిఎ లోపలికి వెళ్లి నిరసన తెలిపేందుకు ప్రయత్నించగా ఉదయం 10గంటలకే అక్కడకు చేరుకోగా పోలీసులు గేటు మూసివేశారు. ఈ నేపథ్యంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, పలు ప్రజా సంఘాల నాయకులు కొంతమంది గేట్‌ను తోసుకుని వెళ్లి ఐటిడిఎ కార్యాలయం వద్ద బైఠాయించారు. డిఎస్‌సి నుంచి గిరిజన గురుకుల ఉపాధ్యాయ పోస్టులకు మినహాయింపు ఇవ్వాలని ముక్త



ఐటిడిఎ వద్ద రాత్రి బస చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

ఖంఠం తో నినదించారు. ఇంకొంత మంది గేటు బయట ఐటిడిఎ ఎదుట ధర్నా నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల సమయానికి ఎపిఒ మురళీధర్, గిరిజన సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి డిప్యూటీ డైరెక్టర్ గియాజుద్దీన్ ఆందోళన వద్దకు వచ్చి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అంతకు ముందు చలో ఐటిడిఎను ఉద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ రావు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో గిరిజన విద్య అస్తవ్యస్తంగా మారిందన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకుని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల డిమాండ్లు ఆమోదించాలని కోరారు. డిఎస్సీ నుంచి అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను మినహాయించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చారని వాటిని అమలు చేయాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అవగాహనా రాహిత్యంగా మాట్లాడుతున్నారన్నారు. ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అప్పటివరకూ ఆందోళన కొనసాగిస్తామని చెప్పి రాత్రి గేటు వద్దే నిద్రించారు. ముట్టడి కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జెఎసి నాయకులు బివి రమణ, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిరా, సిపిఎం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, ఎం.రమణ, కె.సీతారాం, ట్రైబల్ రైట్స్ ఫోరమ్ నాయకులు ఐ.రామకృష్ణ, సిఐటియు నాయకులు సూరిబాబు, లిబరేషన్ నాయకులు పి.సంగం, ఎస్ఎఫ్ఐ జిల్లాఅధ్యక్ష కార్యదర్శులు కె.రాజు, డి.పండు, ఎఐఎస్ఎఫ్ నాయకులు బి.రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు దివాకర్, రాజేష్, జ్యోతి పాల్గొన్నారు.

నేటి నుంచి సామూహిక రిలే దీక్షలు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గిరిజన సంక్షేమ గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకులు శుక్రవారం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట "సామూహిక రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సంఘం నాయకులు దివాకర్, రమేష్, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు రంజిత్ కుమార్ లు తెలిపారు. డిమాండ్లు ఆమోదించే వరకు వివిధ రూపాల్లో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

14న విద్యుత్ బిల్లుల దహనం

- జిల్లా సమగ్రాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలి
- పలు సమస్యలపై మహాసభలో తీర్మానం
- సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలను చాలా దారుణంగా మోపుతోందని, కార్పొరేట్లకు రాయితీలను అందించేందుకు ప్రజలను బలి చేయడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మండిపడ్డారు. వెంటనే పెంచిన ట్రూ ఆఫ్ చార్జీల విధానాన్ని ఉపసంహరించుకోవాలని, విద్యుత్ భారాలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ శనివారం పట్టణ, గ్రామ, మండల కేంద్రాల్లో విద్యుత్ బిల్లులను దహనం చేయాలని కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో నూతన జిల్లా కమిటీ సభ్యులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ సిపిఎం పదో జిల్లా మహాసభలు కురుపాం కేంద్రంగా 10, 11 తేదీల్లో జరిగిందని, ఈ మహాసభల్లో గత మూడేళ్ల కాలంలో సిపిఎం చేపట్టిన పోరాట, రాజకీయ, నిర్మాణ అంశాలపై చర్చించిందని చెప్పారు. భవిష్యత్తు ఉద్యమ అభివృద్ధి, జిల్లా సమగ్ర అభివృద్ధికి అనేక తీర్మానాలు చేపట్టిందని తెలిపారు. రాష్ట్రంలో మన్యం జిల్లా పూర్తిగా వెనుకబాటుకు గురైందని, పాలకుల చిత్తశుద్ధిలోపంతో గిరిజనులు, ప్రజలు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా జిల్లాలో విద్య, వైద్యం, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని చెప్పారు. పార్వతీపురంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు నత్త నడకన కొనసాగుతన్నాయని, వెంటనే పూర్తి చేయాలన్నారు. కురుపాం, సీతంపేట, సాలూరు నియోజకవర్గ కేంద్రాల్లో వంద పడకల ఆసుపత్రులను త్వరగా నిర్మించాలని కోరారు. అలాగే జిల్లా కేంద్రంలో గల చదువులకై పిజి సెంట్రల్ లేకపోవడం అన్యాయమని, పై చదువులకై జిల్లా విద్యార్థులంతా ఇతర జిల్లాలకు వెళ్లి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో లక్షలు పెట్టి చదువుకునే పరిస్థితి నెలకొంటుందన్నారు. జిల్లాలో 40 శాతం మంది ఉన్న గిరిజన విద్యార్థులకు లక్షల్లో పెట్టి చదువుకోవడం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు, నాయకులు

అసాధ్యమని, వెంటనే పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిలిచిపోయిన చెక్ డ్యాములకు అతి తక్కువ డబ్బు ఖర్చు పెట్టి డ్యాములు, మినీరిజర్వాయర్లు, ప్రాజెక్టులు నిర్మిస్తే పూర్తిగా జిల్లాలో భూములన్నీ సాగుకు వచ్చే పరిస్థితి ఉందన్నారు. అలాగే కూలీల వలస విధానాన్ని నివారించవచ్చని అన్నారు. భూ సమస్యలు, పోడుపట్టాల సమస్యలు, జీవో 3, 1/7తో పాటు అనేక రకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ మహాసభలో తీర్మానించినట్టు చెప్పారు. రాబోయే కాలంలో ఉద్యమాల్ని మరింత ఉధృతంగా చేపట్టనున్నట్లు చెప్పారు.

జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన జీవనాధారంగా నిలిచిన జీడి పంటకు మద్దతు ధరను నిర్ణయించాలని కోరారు .అదే ధరకు జిసిసిలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో భూ సమస్యలు, భూ ఆక్రమణలు చాలా ఎక్కువగా ఉన్నాయని, వాటిని పరిష్కరించకుండా నేటి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులతో భూములు సర్వేలు చేపడుతుందన్నారు. ఇది ఎవరి ప్రయోజనం కోసమని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే వైద్యం అందుబాటులో లేకపోవడంతో పాడైపోయిన రోడ్లపై దూర ప్రాంతాలకు వైద్యం నిమిత్తం వెళ్లలేక మలేరియా, డెంగీ జ్వరాలతో గిరిజనులు మరణిస్తున్నారని, ఈనాటికీ డోలీల మోతలు కొనసాగుతున్నాయని చెప్పారు. జిల్లాలో గిరిజన మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ గిరిజన ప్రాంత అభివృద్ధి ఏమాత్రం నోచుకోలేదని తెలిపారు. వెంటనే పాలక ప్రభుత్వాలు దృష్టి సారించాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామస్వామి, జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి శ్రీదేవి, గొర్లి వెంకటరమణ, కొల్లి సాంబమూర్తి, మండంగి రమణ, బి.వెంకటరమణ, బి.రాజశేఖర్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి శోభిక

స్వర్ణంధ్రా-2047 విజన్ సభకు రైతులు, ఉద్యోగులు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్వర్ణాంధ్రా-2047 విజన్ డాక్యుమెంటరీని అవగాహన సదస్సుకు జిల్లా నుంచి 200 మంది ఉద్యోగులు, పారిశ్రామిక వేత్తలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు గురువారం బయలుదేరి వెళ్లారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ నుంచి ఐదు బస్సుల్లో ప్రతినిధులు వెళ్లారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోభిక, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అవగాహన సదస్సు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం జరుగుతుంది. అవగాహన సదస్సులో పాల్గొని, జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. టెక్నాలజీని అందిపుచ్చుకుని ప్రభుత్వ సేవలను వేగవంతం చేసేలా పని చేసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని, కావున అన్ని శాఖల ఉద్యోగులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. కార్యక్రమం డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవి కరుణాకర్, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనిచేయకపోతే వెళ్లిపోండి : పిఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

పనిచేయకపోతే వెళ్లిపోండి... ఇబ్బందిపడి పనిచేయడం ఎందుకు... ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యమందేలా చూడాలని ఫార్మాసిస్టుపై ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేపట్టారు. తొలుత ఆసుపత్రికి వచ్చే రోగుల పేర్లు రికార్డ్ చేసే ఒపి రిజిస్టర్‌ను పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్ రూంను పరిశీలించారు. ఏ విధమైన రక్త పరీక్షలు చేస్తున్నారని టెక్నీషియన్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే మందులు నిల్వ ఉన్న గదిని పరిశీలించి ఆస్పత్రికి వచ్చే మందులను ఆన్లైన్ చేస్తున్నరా లేదా అని ఫార్మాసిస్ట్‌ను ప్రశ్నించగా ఆన్లైన్ చేయలేదని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు చెప్పే పనులు చేయడం లేదా అని వైద్యాధికారులను ప్రశ్నించారు. లేబర్ రూము, ఆరుపడకల గదిని పరిశీలించారు. అలాగే ఐయుడి క్యాలెండర్‌ను కూడా పరిశీలించి తేదీల వారీగా ఉన్న గర్భిణీలు ప్రసవాలు అయ్యాయా, లేదా అని వైద్యాధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ఆసుపత్రి ఇరుగ్గా ఉన్నందున ఆశా కార్యకర్తలు, సిబ్బందితో సమావేశాలు పెట్టడం ఇబ్బందికరంగా ఉందని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమీపంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ బాలురు వసతి గృహంలో 16 మంది



వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

విద్యార్థులు ఉంటున్నారని, అక్కడ సమావేశాలు నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించాలని పిఒ దృష్టికి తీసుకొచ్చారు. సాంఘిక సంక్షేమం శాఖ డిడితో మాట్లాడి మీకు అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఆరోగ్య కేంద్రం వెనుక భాగంలో పాడైపోయిన ఎంపిడిఒ కార్యాలయంలో మందులు నిల్వ ఉంచుకునేందుకు అవకాశం కల్పించాలని వైద్యాధికారులు పిఒ దృష్టికి తీసుకురాగా తహశీల్దార్, ఎంపిడిఒలకు పరిశీలన జరిపేందుకు ఆదేశాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఐరన్ సిప్రోజన్, డైక్లో మందులు కొరతగా ఉన్నాయని వైద్య అధికారులు పిఒ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా కేంద్రానికి ఇండెంట్ పెట్టాలని, అధికారులతో తాను మాట్లాడతానని పిఒ స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, బి.ప్రదీప్ కుమార్, ఇఒ జనార్దన్ రావు, హెల్త్ ఎడ్యుకేటర్ ఆదిలక్ష్మి తదితరులు ఉన్నారు.

పాలకొండ: మండలంలోని అన్నవరం పిహెచ్‌సిని ఐటిడిఎ పిఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో మెరుగైన నిర్వహణకు వైద్యాధికారులకు పలు సూచనలు జారీ చేశారు. రోగులకు సకాలంలో వైద్య సేవలందాలన్నారు. మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. పిహెచ్‌సి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెప్మాలో చేతివాటం

మహిళా సంఘాల నుంచి డబ్బులు వసూలు


ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయితీ పరిధిలోని మెప్మా విభాగంలో అక్రమాలకు అడ్డు, అదుపు లేకుండా పోతున్నాయి. అక్కడ ఉన్న అధికారే వీటిని ప్రోత్సాహస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహిళా సంఘాల నుంచి పైసలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. చేసేదేం లేక రుణం తీసుకుంటున్న సంఘాలు వీరు అడిగినంత సమర్పిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీ, చూడనట్లు వ్యవహరించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో 500కు పైగా సంఘాలున్నాయి. ఒక్కో సంఘానికి రూ.లక్ష నుంచి రూ.15లక్షల వరకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు అందిస్తున్నారు. రుణాలు మంజూరు చేయాలంటే ఒక్కో సంఘం తరపున రూ.3వేలు నుంచి రూ.5వేలు చొప్పున వసూలు చేస్తున్నారు. అలా మామూళ్లు చెల్లించిన వారికే రుణం మంజూరుకు మెప్మా తరపున సహకారం అందిస్తామని కిందస్థాయి సిబ్బంది ఖరాఖండిగా గ్రూపులకు చెప్పి వసూలుకు తెర తీస్తున్నారు. రుణం అత్యవసరం కావడంతో గ్రూప్ సభ్యులు కూడా చేసేదేం లేక మెప్మా సిబ్బంది ఎంత అడిగితే అంత ఇచ్చుకుంటున్నారు. ఇదంతా పైన ఉన్న అధికారులకు తెలుస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అయితే ఈ సొమ్ము ఎవరెవరి చేతుల్లోకి వెళుతుందో తెలియడం లేదు. ఇటీవలే 150 సంఘాలకు సుమారు రూ.2.25కోట్లు బ్యాంక్ గారంటీతో రుణాలు మంజూరు చేశారు. వీరి ద్వారా సుమారు ఏడు లక్షల 50 వేలు రూపాయలు వసూలు చేశారని ఆరోపణలు తెలుస్తోంది. దీనిపై సిటీ మిషన్ మేనేజర్ కృష్ణారావుకు వివరణ కోరగా ఈ వసూళ్ల విషయం తన దృష్టికి రాలేదని అన్నారు.

తొలగించిన చిరుద్యోగులను నియమించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో కెజిబివిల్లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, తొలగించిన ఉద్యోగులను తిరిగి నియమించాలని జిల్లా ఎడిఇఒకు శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు వి.ఇందిర ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. మక్కువ మండలం కాశీపట్నం గ్రామానికి చెందిన డైలీ వేజ్ ఉద్యోగి తోనంగి జ్యోతి, పాచిపెంట మండలం కెజిబివిలో పనిచేస్తున్న డైలీ వేజీ వర్కర్లు అమ్మకుమారి, కుమారి, లావణ్యతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలను పాటించకుండా రాజకీయ వేధింపులతో డైలీ వేజ్ ఉద్యోగులను తొలగించడం అన్యాయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు చేసి ఉద్యోగుల పట్ల నిరంకుశ వైఖరి మానుకోవాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి కక్ష సాధింపులు చర్యలు మానుకొని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కాశీపట్నం కెజిబివిలో పనిచేస్తున్న జ్యోతి 8ఏళ్లుగా డైలీవేజ్‌పై పనిచేస్తుందని, అయినా ఈ ప్రభుత్వం రాజకీయ నాయకులు ఒత్తిడితో తొలగించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఇలా చిరుద్యోగులను తొలగించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఉద్యోగ భద్రత కల్పించి చట్టాన్ని గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో పాచిపెంట మండల సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.



విద్యాశాఖ సిబ్బందికి వినతిని అందజేస్తున్న బాధితులు, నాయకులు ఇందిర

14న నీటి సంఘాల ఎన్నికలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో ఈనెల 14న నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎం.నాగేంద్రప్రసాద్, ఎఇఇ డి.వెంకటరమణలు గురువారం ఒక తెలిపారు. మేజర్ ఇరిగేషన్‌కు సంబంధించి 120 టిసిలు, మైనర్‌కు సంబంధించి 18టిసిలకు గానూ 17400 ఓటర్లు ఓటేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

నర్సింగ్ అభ్యర్థులకు సౌదీలో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓంకాప్, ఎఎల్ యూసుఫ్ ఎంటర్ ప్రైజస్ సంయుక్త ఆధ్వర్యంలో బిఎస్సీ నర్సింగ్, పోస్ట్ బిఎస్సీ నర్సింగ్ పూర్తిచేసిన నిరుద్యోగ యువతకు సౌదీ అరేబియాలోని రీహేబిలిటేషన్ సెంటర్లలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల యువత ఈనెల 15 లోగా https://forms.gle/XoY8SHAdaZCtugb1A లింక్ నందు నమోదుకావాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 18న ఫ్రీ అసెస్మెంట్ నిర్వహించబడుతుందన్నారు. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు గల బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బిఎస్సీ నర్సింగ్ చదివి ఏదైనా ఆసుపత్రిలో కనీసం ఏడాదిన్నర అనుభవం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు సౌదీ అరేబియా దేశంలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 37,500 చెల్లించాల్సి ఉంటుందని, ఆ మొత్తం నుంచే ఎంపికైన అభ్యర్థుల వీసా ఫీజు, రానూ పోనూ విమాన ఛార్జీలను ఎఎల్ యూసుఫ్ ఎంటర్ ప్రైజస్ వారు చెల్లిస్తారని అన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.78,000 నుంచి 89,000 (భారత్ కరెన్సీలో) జీతం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యా సర్టిఫికేట్లు, పాస్ పోర్ట్, ట్రాన్స్క్రిప్ట్ సర్టిఫికెట్, జననం ధృవీకరణ పత్రం, అనుభవ సర్టిఫికేట్, వివాహ ధృవీకరణ పత్రం, నోటరీ లెటర్, నర్సింగ్ కౌన్సిల్ సర్టిఫికేట్, కోవిడ్, ఎంఎంఆర్ సర్టిఫికేట్ తప్పనిసరని పేర్కొన్నారు. నర్సింగ్ పరిజ్ఞానం, ఇంగ్లీష్ భాషా పటుత్వం, డిజిటల్ నైపుణ్యాలలో ప్రాథమిక పరీక్ష ఆధారంగా అర్హతలను నిర్ణయిస్తారని, అర్హత పొందిన వారికి ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తారని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు skillinternational@apssdc.in ఈ మెయిల్ ఐడికి అప్డేట్ చేసిన రెజ్యూమ్ పంపించాలని వివరించారు. ఇతర వివరాలకు 99888 53335, 87901 18349, 87126 55686 మొబైల్ నెంబర్లను సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.



ఆర్‌టిసి డిపో వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

డిఎం వైఖరిపై ధర్నా

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్, హెచ్‌సి పూర్ణాచారి నిరంకుశ వైఖరికి నిరసనగా గురువారం డిపో గేట్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. డిపో పరిధిలో గల అన్ని కార్మిక సంఘాల నాయకులు కలిసి నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, కొత్తచార్ట్ తయారు చేయాలని కోరుతూ కార్మికులు ఆందోళన చేపట్టారు. కండక్టర్, డ్రైవర్లను తొలగించడం, సస్పెండ్ చేయకూడదని టిడిపి ప్రభుత్వ హయాంలో జారీ చేసిన సర్క్యులర్‌ను అప్పటి ఆర్టీసీ ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు కూడా అమలుకు ఆదేశించారని చెప్పారు. అయితే గత కొంతకాలంగా స్థానిక డిపో మేనేజర్, హెచ్‌సి పూర్ణాచారి ఈ సర్క్యులర్‌ను పక్కన పెట్టి వేధిస్తున్నారని సంఘాల నాయకులు ఆరోపించారు. సర్క్యులర్‌కు విరుద్ధంగా 8మంది కార్మికులను ఇటీవల కాలంలో సస్పెండ్ చేశారని చెప్పారు. డ్యూటీలకు సంబంధించిన కొత్త చార్ట్ తయారు చేయాలని డిమాండ్ చేశారు. ఆక్యుపెన్సీ రేషియో ఎక్కువగా ఉన్న బస్సు సర్వీసులను రద్దు చేసి తక్కువగా ఉన్న సర్వీసులను తిప్పుతున్నారని, దీనివల్ల ఆర్టీసీకి నష్టం వస్తుందని చెప్పారు. డిపో యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రీజినల్ సెక్రటరీ పి.సుందరరావు, డిపో సెక్రటరీలు ఎంఎస్ నారాయణ, పి.శేఖర్, డిఎస్ రావు, పిఎస్ రావు పాల్గొన్నారు.

గంజాయి సాగు, సారా రవాణాపై డ్రోన్‌తో పర్యవేక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఆంధ్రా - ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి, అక్రమ సారా రవాణాను నిరోధించేందుకు డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ ప్రారంభిస్తున్నట్లు రూరల్ ఎస్సై సంతోషి కుమారి తెలిపారు. గురువారం రావికోన పంచాయతీ ఒడిశా సరిహద్దు గ్రామాలైన చందలంగి, బట్టివలస, కొత్తవలస, రంగాలగూడ గ్రామాలలో ఆమె పర్యటించి డ్రోన్ సహాయంతో సరిహద్దు ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో పోలీసు సాంకేతిక బృందం, తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ విజయపార్వతి

గర్భిణుల వసతి గృహ సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక వైటిసిలో నిర్వహిస్తున్న గర్భిణుల వసతి గృహాన్ని డిఎంహెచ్ఓ కె.విజయపార్వతి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. మంచి ఆహారం తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి గర్భిణీతో కాసేపు మాట్లాడారు. ఆమెతో పాటు వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని ఖడ్గవలస జంక్షన్ వద్ద స్థానిక ఎస్సై పి.రమేష్ నాయుడు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రయాణించేటప్పుడు తప్పకుండా భద్రతా నియమాలను పాటించాలని, మితిమీరిన వేగంతో ప్రయాణించొద్దని, గమ్యస్థానాలను సురక్షితంగా చేరుకోవాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్ చట్టవిరుద్ధం నేరమని, 14ఏళ్లలోపు వారికి వాహనాలను తల్లిదండ్రులు ఇవ్వరాదని, ఎటువంటి ప్రమాదం జరిగినా తల్లిదండ్రులు శిక్ష అర్హులు అవుతారని తెలిపారు. మలుపుల వద్ద పరిమిత వేగంతో వాహనాన్ని నడపాలని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బాబ్జీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

తాగునీటి సమస్య తీర్చడమే లక్ష్యం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం, తాగునీటి సమస్య పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. స్థానిక కూటమి కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్యం పరంగా వైద్య సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించడం మన ధ్యేయంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీతంపేటను పారిశ్రామిక హబ్‌గా మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇది అతి త్వరలో ఇండస్ట్రియల్ మీటింగ్ నిర్వహించి గిరిజనులకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నాబార్డ్‌తో చర్చించి పైనాపిల్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సీతంపేటలో పెట్టేలా సన్నాహాలు జరుగుతున్నాయి అని తెలిపారు. ప్రజలకు ఎళ్లవేళల అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు.కార్యక్రమంలో కూటమి నాయకులు సవరతోట ముఖలింగం, ఇమరక ప్రసాద్, ఐటిడిపి నియోజవర్గ కోఆర్డినేటర్ విమరక పవన్, బిడ్డిక సోను, ప్రవీణ్, సాయి సంధ్య, సర్పంచ్ నీలయ్య తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

అన్నదానం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న భవాని మాత ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర హాజరై, భవానీ మాతను దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఆలయ నిర్వాహక సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇటువంటి కార్యక్రమాలు పేదలకు ఉపయుక్తంగా ఉంటాయని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్ర మంలో టిడిపి నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

సంస్కృత ఉన్నత పాఠశాలకు బహుమతుల పంట

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో గల గీతాసమావేశ మందిరం వారు విద్యార్థులకు భగవద్గీత శ్లోకపఠన పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా పరిషత్ సంస్కృతోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుపొందారని ప్రధానోపాధ్యాయులు జి హేమ సుందర్ తెలిపారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి అనుపోజు తన్మయి, ద్వితీయ బహుమతి వాండ్రాసి సాయిశ్రీ, తృతీయ బహుమతి అంకం ఝాన్సీ పొందగా, జూనియర్స్ విభాగంలో వాండ్రాసి నిహారిక ప్రథమ బహుమతి, తాడ్డి హరిప్రియ ద్వితీయ బహుమతి, కె.లలిత కామాక్షి తృతీయ బహుమతిని కైవశం చేసుకున్నారు. వీరికి గీతా సమావేశ మందిరం నిర్వాహకులు గడ్డ సత్యనారాయణ, వాసు, వినాయక మహారాణా, ప్రముఖ సాహితీవేత్త బెహరా ఉమామహేశ్వరరావు, కుమారభట్టర్ గోపీనాథచార్యులు చేతుల మీదుగా బహుమతి అందజేశారు. విద్యార్థులను తయారుచేసిన సంస్కృత పండితులు జె.బి. తిరుమలా చార్యులను అభినందించారు.

జెడ్‌పి పాఠశాలకు కుర్చీలు వితరణ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కురుపాం కళింగ వైశ్య సంఘం అధ్యక్షులు, పాఠశాల పూర్వ విద్యార్థి కొత్తకోట రవీంద్రకుమార్ కుర్చీలను వితరణగా గురువారం ప్రధానోపాధ్యాయులు తోట శంకరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే పాఠశాలలో చదువుకొని పూర్వ విద్యార్థి అయి ఉండడం సంతోషంగా ఉందన్నారు. పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందజేస్తానని అన్నారు. అలాగే పాఠశాలకు భవిష్యత్‌లో కూడా సహాయ సహకారాలు అందిస్తూ ఉంటానని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొటారి రాజు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కుర్చీలను అందజేస్తున్న రవీంద్రకుమార్

ప్రమాదకరంగా డివైడర్

పట్టించుకోని అధికారులు
ప్రమాదాల బారిన ప్రయాణికులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్ ప్రమాదకరంగా మారింది. డివైడర్‌కు రంగులు వేయకపోవడం, అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు అమర్చాల్సి ఉన్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో గుత్తేదారుడు వీటిని ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రమాదాలు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది మే 29న ప్రియాంక ఫిల్లింగ్ స్టేషన్ వద్ద మార్గమధ్యలో ఉన్న డివైడర్ కనిపించకపోవడంతో పాలకొండ నుంచి పార్వతీపురం వైపు వెళ్తున్న కారు వాటిని ఢీకొనడంతో కారు ముందు టైరు పేలిపోవడంతో వాహనంలో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. అదేవిధంగా ఈనెల 10న స్థానిక తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ విధులు ముగించుకొని తన స్వగ్రామమైన పొగిరి వెళ్తుండగా తెలగవీధి జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మనిషిని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టడంతో కారు ముందుభాగం టైర్ పేలిపోయింది. దీంతో తహశీల్దార్ సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అటు ఆర్ అండ్ బి అధికారులకు గానీ, ఇటు గుత్తేదారులకు చలనం లేదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. మరిన్ని ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి రహదారికి మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్లకు రంగులతో పాటు విద్యుత్ స్తంభాలు కూడా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



అసంపూర్తిగా విడిచిపెట్టిన డివైడర్



శిక్షణలో మాట్లాడుతున్న డిపిఎం షన్ముఖరాజు

ఆరోగ్య పరిరక్షణ ఎంతో అవసరం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఎంత సంపద ఉన్నా ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు (డిపిఎం) పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని తోటపల్లి నూతన జట్టు ట్రస్ట్ ప్రాంగణంలో ఆరోగ్య పోషణ కార్యకర్తలకు రెండు రోజుల పాటు కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో గ్రామ సంఘ సభ్యులు 50మందికి శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో పాల్గొన్న డిపిఎం మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యం కాపాడుకొనేందుకు చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, అపరాలు వినియోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అన్ని రకాల పోషకాలు కలిగిన పదార్థాలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించే ఉత్పత్తులను వినియోగించుకోవడం జరుగుతుందని, అందుకు ప్రతి కార్యకర్త సంబంధిత గ్రామంలోని రైతులతో పోషక విలువలు కలిగిన పంటలను పండించి వినియోగదారులకు, ఉత్పత్తిదారులకు లభ్యమయ్యేలా అందుబాటులో ఉంచాలని, ఆరోగ్యం బాగుండాలంటే మంచిఆహారం తీసుకోవాలని, గర్భిణీలు, బాలింతలు ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులు తినాలని వివరించారు. కార్యకర్తలకు శిక్షణలో బాగంగా రెండో రోజు సిబ్బందికి రెడ్డి శ్యామల పొలంలో ఎటిఎం మోడల్ చూపించి అదాయలు, ఖర్చులు సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్‌పర్సన్ ఎన్.వెంకట సత్య, ఎన్ఇఎఫ్‌లు జి.అన్నపూర్ణ, శోభ, శారద, యశోద, గౌరి, అంబోజీ, ముసలయ్య, రెండు మండలాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

దశమంతపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలం దశమంతపురంలో గురువారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, రక్తపోటు, మధుమేహ, జ్వర పీడితులకు ప్రత్యేక వైద్యతనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని అంటికొండ, అచ్చిబ, కూరసింగి తదితర గ్రామాల్లో గురువారం స్థానిక తహశీల్దార్ పి.అప్పలరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో ఎక్కువగా ముటేషన్, పేరు మార్పులు వచ్చాయని అన్నారు. వారసత్వాలు, భూములు మార్చాలని చెప్పారు. ఈ సమస్యలు 45 రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపతహశీల్దార్ మధుసూదనరావు పాల్గొన్నారు.

సచివాలయాల ఆకస్మిక సందర్శన

ప్రజాశక్తి - మక్కువ

జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి రాంగోపాల్ గురువారం మండలంలోని సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించారు. కవిరిపల్లి, మక్కువ-1,2, శంబర సచివాలయాలను సందర్శించి అక్కడ సిబ్బందితో రెండుపూటలా హాజరు తప్పకుండా వేయాలని సూచించారు. హౌస్ హోల్డ్, ఎంపిఐఐ, స్కూల్ ఇన్స్పెక్షన్ తదితర సర్వే రిపోర్టులు ఆయన పరిశీలించారు. కార్యక్రమములో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటిసంఘాల ఎన్నికలకు కసరత్తు

ప్రజాశక్తి -పాలకొండ

ఈనెల 14న జరగబోయే నీటిసంఘాల ఎన్నికలకు అధికార యంత్రాంగం కసరత్తు చేపడుతోంది. మండలంలోని 3 మేజర్, 8 మైనర్ సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఇరిగేషన్, రెవెన్యూతో పాటు పంచాయతీ కార్యదర్శులు ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా ఈ ఎన్నికలకు రాజకీయ రంగు పులుముకొంది. రాజకీయ నేతలు నీటి సంఘాల్లో తమ పెత్తనం చూపించడానికి ఇప్పటికే బహిరంగంగా తమ ప్రయత్నాలు చేస్తున్నారు. కూటమి నేతలు ఓ పక్క ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించుకోవాలని ప్రయత్నిస్తుండగా, స్థానిక సంస్థల్లో బలంగా ఉన్న వైసిపి తమ ప్రాబల్యం చూపేందుకు సిద్ధంగా ఉంది. ఇటీవలే ఎమ్మెల్సీ విక్రాంత్ తన గ్రూపీయులతో సమావేశం నిర్వహించగా, ఎమ్మెల్యే జయకృష్ణ కూడా మండలాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి నీటి సంఘాలన్నీ ఏకపక్షంగా కూటమి ఖాతాలో చేరాలని సూచించారు. అదే విధంగా జయకృష్ణ కు వ్యతిరేకంగా ఉన్న టిడిపి పాలకొండ నియోజకవర్గ ఇంచార్జి పడాల భూదేవి గ్రూపు కూడా తమ ప్రాభల్యం చూపించాలని ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా నీటిసంఘాల ఎన్నికల్లో ఎవరు తన పట్టు చూపిస్తారో వేచి చూడాల్సిందే.

నీటి సంఘాల గెలుపునకు కృషి

స్థానిక నగర పంచాయతీ పరిధిలో గల నీటి సంఘాల ఎన్నికల్లో టిడిపి అన్ని స్థానాల్లో విజయం సాధించేందుకు మనమంతా ఐక్యంగా పనిచేయాలని పాలకొండ పట్టణ టిడిపి సీనియర్ నాయకులు, నగర పంచాయతీ అభివృద్ధి కమిటీ చైర్మన్ పల్లా కొండలరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఆయనున్న కలిసిన ఎన్‌కె రాజగోపాలపురం గ్రామ టిడిపి నాయకులతో నీటి సంఘాల ఎన్నికలపై చర్చించారు. ఈనెల 14న జరగనున్న నీటి సంఘం ఎన్నికలకు అన్ని స్థానాల్లో టిడిపి పోటీకి సిద్ధం ఉంటూ ఎటిసికి ఏ అభ్యర్థిని పోటీ చేయించాలని ఈ సందర్భంగా చర్చించారు. ఈ నీటి సంఘాలు ఎన్నికల్లో వీలున్నంత వరకు ఏకగ్రీవాల వైపు దృష్టి పెట్టాలని నిర్ణయించారు. సమావేశంలో స్థానిక ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ వెన్నపు శ్రీనివాసరావు, నీలాపు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

హెల్త్, వెల్నెస్ కేంద్రాల్లో వైద్యసేవలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గ్రామీణ ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా హెల్త్, వెల్నెస్ కేంద్రాల్లో వైద్య సేవలు అందించాలని వైద్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు పేర్కొన్నారు. మండలంలో గొట్టివలస, రావుపల్లిలోని హెల్త్, వెల్నెస్ కేంద్రాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో క్షేత్ర స్థాయి సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా అని పరిశీలించారు. కేంద్రంలో ప్రతి రోజూ ఎంత మందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నారు, ఇస్తున్న చికిత్సా వివరాలు ఒపి రికార్డులో పరిశీలించారు. రోగుల ఆరోగ్య సమస్యలు స్పష్టంగా నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కేంద్రంలోని వైద్య పరికరాలు, చేపడుతున్న పరీక్షలపై ఆరా తీశారు. పరీక్షల నివేదికలు సకాలంలో తెలియజేయాలన్నారు. గర్భిణీ, శిశు గృహ సందర్శనలు చేసి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య స్థితి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎపెడిమిక్ ఇఒ సత్తిబాబు, సూపర్వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది విజయలక్ష్మి, మంగమ్మ, జానకి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

డెప్యుటేషన్ రద్దు చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట నుంచి ఉపాధ్యాయులకు పాడేరుకు వేసిన డెప్యుటేషన్లు రద్దు చేయాలి డెమొక్రటిక్ టీచర్ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కోత ధర్మారావు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ వింత వైఖరి సీతంపేట నుంచి పాడేరు డెప్యుటేషన్ వేయడం అన్యాయమన్నారు. గిరిజన సంక్షేమ గురుకులంలో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ ఉపాధ్యాయులు తమ పోస్టులను డిఎస్‌సిలో చూపించడం వల్ల ఏళ్ల తరబడి పని చేస్తున్న తమ ఉద్యోగాలు లేకుండా పోతున్నాయని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సమ్మె చేస్తున్నారని అన్నారు. స్థానిక ఐటిడిఎ గిరిజన సంక్షేమ శాఖ ఆధీనంలో గల ఆశ్రమ స్కూల్‌లో పని చేస్తున్న జూనియర్లు అయిన ఎస్‌జిటి ఉపాధ్యాయులను పాడేరు ఐటిడిఎ పరిధిలో గల వివిధ గురుకుల పాఠశాలల్లో 25 మంది టీచర్లు డెప్యూటషన్ వేశారు. ఇందులో మహిళ టీచర్లు కూడా ఉన్నారన్నారు. డెప్యుటీషన్లు మండల, జిల్లా పరిధిలో వేస్తారు కానీ, గిరిజన సంక్షేమ శాఖ ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు వేయడం అన్యాయమని అన్నారు. డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తూ వెంటనే 25 మంది టీచర్స్ డెప్యూటేషన్ రద్దు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురుకులం, ఆశ్రమ స్కూల్ నిర్వహణ, పని వేళలు, టీచర్స్ సర్వీస్ రూల్స్ వేర్వేరుగా ఉన్నప్పటికీ డెప్యుటేషన్ వేయడం దారుణమన్నారు. సమావేశంలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ రఘురాం స్వామి కార్యవర్గసభ్యులు బి.రమణమూర్తి పాల్గొన్నారు

సచివాలయాన్ని సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సోమగండి సచివాలయాన్ని ఎంపిడిఒ కె.గీతాంజలి గురువారం సందర్శించారు. సచివాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారికి అవసరమైన వివిధ ధ్రువపత్రాలు మంజూరు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అవసరమైన నాన్ అవైలబిలిటీ పంచాయతీ కార్యదర్శి నుంచి సంబంధిత పత్రాలతో వచ్చినట్లయితే వారికి సచివాలయంలోనే డేట్ అఫ్ బర్త్ ధ్రువపత్రం కోసం అప్లై చేయించడం జరుగుతుందని చెప్పారు. ఆర్డీవో కార్యాలయం మంజూరు చేసిన వెంటనే సచివాలయంలో డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్ మంజూరు చేస్తామని అవగాహన కల్పించారు. ప్రతి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ద్వారా మిస్సింగ్ సిటిజెన్ వివరాలు తెలియజేస్తామన్నారు. సంబంధిత సచివాలయ సిబ్బంది మిస్సింగ్ సిటిజన్ వివరాలను వారి బయోమెట్రిక్ ద్వారా నమోదు చేస్తామని చెప్పారు. తప్పనిసరిగా మిస్సింగ్ సిటిజన్ అనగా హౌస్ హెుల్డ్ సర్వేలో నమోదైన గ్రామస్తులు మిస్సింగ్ సిటిజెన్ సర్వేలో తప్పనిసరిగా బయోమెట్రిక్ ద్వారా వివరాలను పొందుపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సోమగండి, కిరప పంచాయతీ కార్యదర్శులు ఎస్.సింహాచలం, విఆర్ఒ తులసీబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ అక్కరాజు, మహిళా సంరక్షణ అధికారి యమున, డిజిటల్ అసిస్టెంట్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ గీతాంజలి

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సైబర్ నేరాలపై ఖాతాదారులు అవగాహన పెంచుకోవాలని, ఎటువంటి సైబర్ మోసాలకు లోను కాకూడదని జిల్లా లీడ్ బ్యాంకు అధికారి జెఎల్ఎన్ మూర్తి తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను అనేక విధాలుగా ఆశ చూపించి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి బ్యాంకు ఖాతా నుంచి నగదు దోచుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. సైబర్ నేరాలు ఎక్కువగా ఆన్లైన్లో జరుగుతున్నాయని అన్నారు. రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా 90ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజలందరికీ సైబర్ నేరాలపై అవగాహన నిమిత్తం జిల్లాలోని అన్ని గ్రంథాలయాలకు 6 రకల పుస్తకాలను ఉచితంగా అందజేశామన్నారు. జిల్లాలోని మిగతా గ్రంథాల యాలకు ఈ పుస్తకాలను పోస్ట్ ద్వారా పంపించా మన్నారు. ప్రజలంతా ఈ పుస్తకాలను చదివి సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని, ఆర్థిక లావాదేవీల్లో జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ సిబ్బంది కె.మౌనిక పాల్గొన్నారు.

కురుపాం :సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి ఉండాలని ఎస్సై పి.నారాయణరావు అన్నారు. గురువారం కురుపాంలో జరిగిన వారపు సంతలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా సంతకు వచ్చిన గిరిజన ప్రజలకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళల చట్టాలు, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల జరిగిన ప్రమాదాలు గూర్చి అవగాహన కల్పించారు. అనంతరం మొబైల్ ఫోన్ వాడిన వారు చాలా జాగ్రత్తగా ఉండాలనిని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కురుపాంలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వైసిపి ఆధ్వర్యంలో శుక్రవారం పార్వతీపురంలో తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వైసిపి ఆధ్వర్యంలో రైతు సమస్యలపై పోరాటం చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు ఎంతో అన్యాయం జరుగుతుందన్నారు. రైతులు సమస్యలు పరిష్కరించేందుకు చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న ఎస్‌డిజి అవగాహన తరగతులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మౌలిక వసతుల ఏర్పాటుతో పాటు ఆర్థికంగా పంచాయితీ అభివృద్ధి లక్ష్యంగా ప్రణాళిక ప్రకారం విధులు నిర్వహించాలని ఎంపిడిఒ కె.రూపేష్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో విడతల వారీగా సచివాలయ సహాయకులకు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న ఎస్‌డిజి కార్యక్రమంపై మూడో రోజు అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన పెంచుకోని కోరారు. కార్యక్రమంలో డిఎల్‌డిఒ రామ్ నరేష్‌తో పాటు మాస్టర్ ట్రేనీలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : సామాజిక న్యాయం, సుస్థిర అభివద్ధి వనరులు, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రణాళిక తయారుచేయు విధానంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం జియమ్మ వలస మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిపి బొంగు సురేష్ ప్రారంభించారు. ఎంఒటిలుగా పిఆర్ ఎఇ, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ, ఐసిడిఎస్, ఐకెపి ఎపిఎం, ఆరోగ్యశాఖ అధికారులు శిక్షణలో పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్, పంచాయతీ సర్పంచులు కార్యదర్శులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : గ్రామాల్లో చేట్టే అన్ని అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది సమగ్రంగా పనిచేసినప్పుడే విజయవంతమవుతాయని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం అభివద్ధి చెందేలా ఆ గ్రామంలో ప్రజలకు ఏఏ అవసరాలు వుంటాయో తెలుసుకొని ఆ కార్యక్రమాలను జరిపితే ఉపయోగం ఉంటుందని తెలిపారు. ఎంపిడిఒ రమాదేవి మాట్లాడుతూ స్థానిక సిబ్బంది మీ పరిధిలో ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాలు, స్థానిక ప్రజల అవసరాలను, అభిప్రాయాలను, సూచనలను తెలుసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎఒ జి.పార్వతి, ఇఒపిఆర్‌డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు .



సాలూరులో మాట్లాడుతున్న వైస్ ఎంపిపి సురేష్

శిశు విక్రయదారులపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

శిశు విక్రయాలు, అనధికార దత్తత స్వీకరించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన అనధికార దత్తత, బాల్య వివాహాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో శిశువులను విక్రయించిన అనధికారంగా దత్తత తీసుకున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. వీటిపై ఎలాంటి సమాచారం తెలిసినా 1098కి తెలపాలని కోరారు. పిల్లల్లేని దంపతులు పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖకు చెందిన సెంట్రల్ ఆడాప్షన్ రిసోర్స్ అథారిటీ వెబ్ సైట్ ద్వారా దత్తత కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకోసం www. cara.wcd.gov.in వెబ్ సైట్ ద్వారా మాత్రమే పిల్లల్ని దత్తత తీసుకోవాలని తెలిపారు. అలాగే బాల్య వివాహ నిరోధక అధికారులు వీటి ఏ విధంగా అరికట్టాలో గ్రామంలో బాలవిహాలు జరగకుండా చూసుకోవాల్సి బాధ్యత వివరిం చారు. కార్యక్రమంలో అప్ హెూల్డ్ డిస్టిక్ కో ఆర్డినేటర్, శిశు గృహ స్టాఫ్, వన్ స్టాప్ సెంటర్ స్టాఫ్, బాలసాధనం స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



మృతి చెందిన అంజిబాబు

పామును పారవేయబోయి మృత్యుఒడికి

ప్రజాశక్తి - మక్కువ

ఐరన్ పైపులో దూరిన పామును బయటకు పారదోలే క్రమంలో పైపును నిలువుగా లేపడంతో విద్యుత్ హైటెన్షన్ తీగెలకు పైపు తగలడంతో షాక్‌కు గురై కార్మికుడు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని శంబర-ఎస్ పెద్దవలస రహదారి మధ్యలో గల ఇటుక బట్టి వద్ద పని చేస్తున్న కర్రి అంజిబాబు (25) ఎప్పటిలాగే తన పనిలో నిమగ్నమై ఉన్నాడు. ఇంతలో పైపులో పాము దూరిందని కేకలు వేయడంతో వెంటనే అక్కడకు చేరుకుని అంజిబాబు ఇనుప పైపును పైకి లేపారు. దీంతో అదే ప్రాంతంలో పై భాగంలో విద్యుత్ తీగలకు ఇనుప పైపు తగలడంతో షాక్‌కు గురయ్యారు. దీంతో అక్కడున్న కూలీలు వెంటనే శంబర పిహెచ్‌సికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. మక్కువ యానాదుల వీధికి చెందిన అంజి బాబుకు భార్య శైలు, చంటి పిల్ల ఉన్నారు. అంజిబాబు మృతితో కుటుంబం దుఃఖంలో మునిగిపోయింది.

వరిచేను నూర్పులో ప్రమాదం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ బోరింగువలసకు చెందిన తాడంగి కృష్ణ వరి చేను నూర్పు చేపడుతుండగా ప్రమాదవశాత్తూ తన చేయి మిషన్ లో పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన పక్కనే ఉన్న మిగిలిన వారు అప్రమతమై వెంటనే పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇదిలా ఉండగా గత ఏడాది కూడా ఆయన నూర్పుడు యంత్రంలో చేయికి ఇదే తరహాలో ప్రమాదానికి గురైనట్లు స్థానికులు చెబుతున్నారు.